విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

విశాలాంధ్ర క్యాలండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-ఉంగుటూరు : నిజాన్ని నిర్భయంగా రాసే జాతీయ పత్రిక విశాలాంధ్ర దినపత్రిక అని తాడేపల్లి గూడెం డైమండ్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు కోనా హనుమాన్‌బాబు పేర్కొన్నారు. బుధవారం ఉంగుటూరు మండలం కైకరంలో మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ముప్పన భుజంగరావు ఆధ్వర్యంలో 2023 నూతన విశాలాంధ్ర క్యాలెండర్‌ను లయన్స్ క్లబ్ అధ్యక్షులు హనుమాన్ బాబు ఆవిష్కరించారు. విశాలాంధ్ర 1952లో స్థాపించి ఇప్పటికీ 70 సంవత్సరాలు పూర్తయ్యిందని అన్నారు. నూతన క్యాలెండర్లను అధికారులకు, ప్రజాప్రతినిధులకు, ప్రజలకు, వ్యాపారస్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశాలాంధ్ర విలేకరులు ముప్పన భుజంగరావు, కరుటూరి చిన్న రాజా, పలువురు ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్ ప్రశాంతికి పుట్టినరోజు శుభాకాంక్షలు

విశాలాంధ్ర - భీమవరం : పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి పుట్టినరోజు వేడుకలు బుధవారం క్యాంపు కార్యాలయంలో జరిగాయి. జిల్లా జాయింటు కలెక్టరు జెవి మురళి ,సబ్ కలెక్టరు యం. సూర్యతేజ, ఇన్‌చార్జి డిఆర్‌వో దాసి రాజులు , కుటుంబ సభ్యులతో కలసి జిల్లా కలెక్టరు చేత కేక్ కట్ చేయించారు. వారంతా జిల్లా కలెక్టరకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. హౌసింగ్ బోర్డ్ కాలనీలోని శ్రీపద్మావతి వెంకటేశ్వర స్వామి వారి సన్నిధానంలో వారి తండ్రి బుచ్చిబాబు విశేష పూజలు చేయించారు. జిల్లా కలెక్టరు క్యాంపు కార్యాలయంలో శ్రీపద్మావతి వెంకటేశ్వర స్వామి వారి ఆలయ పాలకులు ,అర్చకులు ఆలయ మర్యాదలతో జిల్లా కలెక్టరు పి. ప్రశాంతికి స్వామివారి శేష వస్త్రం అందించి, వేద ఆశీర్వచనాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి,అర్చకులు పాణింగిపల్లి శ్రీనివాసాచార్యులు,కుక్కల బాల వెంకటరత్నం, గాదిరాజు సుబ్బరాజు, కదలి వెంకటేశ్వరరావు , తది తరులు పాల్గొన్నారు.

రవీంద్రనాథ్‌కు మంత్రి కారుమూరి పుట్టినరోజు శుభాకాంక్షలు

విశాలాంధ్ర- తణుకు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎంఎస్ఎమ్ఈ చైర్మన్ వంకా రవీంద్రనాథ్ జన్మదినం సందర్భంగా బుధవారం రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహా రాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రి వెంట తణుకు మండలం అధ్యక్షులు పోలేపల్లి వెంకట ప్రసాద్, వైసిపీ నాయకులు తదితరులు ఉన్నారు.

8 మంది చిన్నారులకు గుండె శస్త్ర చికిత్సలు

విశాలాంధ్ర-భీమవరం: వసుధ ఫౌండేషన్, హైదరాబాద్ ఎస్.ఎల్.జి.హాస్పిటల్స్ సహ కారంతో అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం ద్వారా ఎనిమిది మంది చిన్నారులకు గుండె శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరంలో స్క్రినింగ్ పరీక్షలు చేసి ఎంపిక చేసిన చిన్నారులను విజయవాడ ఆంధ్ర హాస్పిటల్స్ లో శస్త్ర చికిత్సలు నిర్వహిం చారు. ఇంటర్ వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కె.విక్రమ్ చిన్నారులను పరీక్షించి ఆరోగ్యం గా ఉన్నారని తెలియచేసారు. గత నాలుగు నెలలుగా హృద్రోగంతో ఇబ్బంది పడుతున్న చిన్నారులకు డాక్టర్ కె.విక్రం స్క్రినింగ్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులు వసుధ ఫౌండేషన్ చైర్మన్ వెంకటరామ రాజుకు, ప్రతినిధులు ఇందుకూరి ప్రసాద్ రాజు ,ఎం.వి.రామరాజు, ఎస్ ఎల్ జి హాస్పిటల్స్, భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

3న మెగా జాబ్‌మేళా

విశాలాంధ్ర -భీమవరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జనవరి 3వ తేదీన తమ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆర్.ఆర్.డి.ఎస్.ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కె.జె.ప్రసూన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ చదివిన 35 సంవత్సరాల లోపు విద్యార్థులు అర్హులని తెలిపారు. 14 కంపెనీల ప్రతినిధులు జాబ్ మేళాలో స్క్రినింగ్ పరీక్షలు నిర్వహించి నియామకం పత్రాలు అందచేస్తారని ఈ అవకాశాన్ని భీమవరం పరిసర ప్రాంతాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

రథసారధుల నియామకంలో అసంతృప్తులు

- ఎమ్మెల్యే వర్గీయులపై అధిష్టానానికి ఫిర్యాదులు

విశాలాంధ్ర - లింగపాలెం : చింతలపూడి నియోజకవర్గంలోని అధికార పార్టీలో సచివాలయ రథసారధుల నియామకంలో విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. ఒక్కొక్క సచివాలయ పరిధిలో ముగ్గురు రథసారధులను నియమించాలని, వీరిలో ఒకరు మహిళ ఉండాలని సీఎం జగన్ ఆదేశాలిచ్చారు. నియోజకవర్గంలో రెండు వర్గాల మధ్య నడుస్తున్న పోరు వీరి నియామకంలో ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ జిల్లా కో-ఆర్డినేటర్ మిథున్‌రెడ్డికి, నియోజకవర్గ పరిశీలకులు గుణ్ణం నాగబాబుకు ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలోని ముగ్గురు జడ్పీటీసీలు, ఇద్దరు మండల పార్టీ అధ్యక్షులు వీరి అనుచరులు రాజధాని అమరావతికి తరలివెళ్ళి కో-ఆర్డినేటర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో సంప్రదింపులు లేకుండా ఏకపక్షంగా రథసారధులను నియమించారని, వీరిలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు ఇతర పదవుల్లో ఉన్న వ్యక్తులకు చెందిన భార్యలకు, భర్తలకు ఈ పదవులు ఇచ్చారంటూ ఆరోపించారు. గ్రామంలో సమావేశాలు నిర్వహించకుండా రథసారధులను నియమించారంటూ కో-ఆర్డినేటర్‌కు ఏకరువు పెట్టారు. నియోజకవర్గంలో రెండు వర్గాల మధ్య నెలకొన్న విభేదాలకు తెరపడుతుందనుకుంటున్న కార్యకర్తలు జరుగుతున్న పరిణామాలపై నిరాశ వ్యక్తం చేస్తున్నారని అసంతృప్తివాదులు కో-ఆర్డినేటర్‌కు తెలిపారు. రథసారధులకు సంబంధించి అసంతృప్తివాదులు మరో జాబితాను అధిష్టానానికి ఇచ్చారు. దీనిపై ఏం చేస్తారోనని పార్టీలో అసక్తి నెలకొంది.

ట్యాబ్‌ల పంపిణీ

విశాలాంధ్ర - లింగపాలెం : లింగపాలెం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదవ తరగతి చదువుతున్న 415 మంది విద్యార్థులకు, 67 మంది ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే ఎలీజా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. శింగగూడెం ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం అనేక పథకాలను ప్రవేశపెడుతుందని, వీటిని వినియోగించుకుని మెరుగైన ఫలితాలు సాధించాలని అన్నారు. భవిష్యత్ తరాలలో భావి పౌరులు ఉన్నత స్థితిలో ఉండేందుకు సీఎం జగన్ విద్యార్థులకు అండగా ఉంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి రామారావు, ఎంపిడిఓ ఆశీర్వాదం, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మట్టా సురేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర- ఏలూరు : అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసి)ఏలూరు మహాసభ ఆర్.ఆర్. పేట, స్ఫూర్తి భవన్‌లో కశిం కోట నాగేంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఎండనక, వాననక ప్రజల ఆరోగ్యాల పరిరక్షణకు, పరిసరాలు పరిశుభ్రంగా చేయుటకు మున్సిపల్ కార్మికులు తమ ప్రాణాలను ప్రాణంగా పెట్టి పని చేస్తున్నారన్నారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధిగా వ్యవహరించ డం లేదని, జీతాలు సక్రమంగా చెల్లింపులు చేయట్లేదని కార్మికుల పట్ల ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని విమర్శిం చారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ అలుపెరు గని పోరాటం చేస్తుందని, సంఘాన్ని బలోపేతం చేయడం ద్వారా కార్మికుల సమస్యల పరిష్కారా నికి ఉధృతమైన పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఏపి మున్సిపల్ వర్కర్స్ యూని యన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భజంత్రీ శ్రీనివాస్ మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన పారిశుద్ధ్య కార్మికులకు ఆర్థిక తోడ్పాటును అందించడంతో పాటు కుటుంబ సభ్యులలోని ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికు లను అదనంగా నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి చర్యలు చేపట్టాలన్నారు. ఏఐటీయుసి జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు తొర్లపాటి బాబు, విగ్నేష్, ఏఐటీయుసి నాయకులు కె.కృష్ణమా చార్యులు మాట్లా డుతూ జీతాలను సక్రమంగా చెల్లించాలని, ఆరోగ్య భద్రత, ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మికులకు యూనిఫామ్, గ్లౌజులు, బూట్లు, సబ్బులు, ఐడెంటి కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య, ఎన్ఎఫ్ఐడబ్ల్యు ఏలూరు శాఖ కోశాధికారి మావూరి విజయ మాట్లాడుతూ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీ యూసీ అనేక పోరాటాలు నిర్వహించి విజయం సాధించిందని, అటువంటి సంఘాన్ని ఏలూరు నగరంలో మరింత అభివృద్ధి చేయడానికి నూతనంగా ఎన్నికయ్యే కమిటీ కృషి చేయాలని అభిలాషించారు.

30న అఖిలపక్షం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

విశాలాంధ్ర - ఏలూరు : ఏలూరు స్మశాన వాటికలలో అంత్యక్రియలు రూ.5వేలు నగదు వసూలు చేయాలనే మునిసి పల్ కౌన్సిల్ 53వ తీర్మానం రద్దు చేయాలని కోరుతూ అఖిలపక్షం ఆధ్వ ర్యంలో ఈ నెల30 వ తేదీన ఏలూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు అఖిలపక్ష నాయకులు తెలిపారు. బుదవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు బండి వెంకటేశ్వరరావు, సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పళ్ళెం కిషోర్, సీపీఐ ఎం ఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు. వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నగర అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు, టిడిపి మాజీ కార్పొరేటర్ బౌరోతు బాలాజీ, జనసేన నగర ఉపాధ్యక్షులు గుబ్బల నాగేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ లో స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించడానికి రూ.5వేలు నగదు వసూలు చేయాలని, ఇటీవల జరిగిన కౌన్సిల్ సర్వ సభ్య సమావేశంలో 53వ తీర్మానంగా ఆమోదించడం సిగ్గుచేటన్నారు. అంత్యక్రియలు అనేవి ఎవరికి వారు, మృతుల బంధువులు వారి వారి ఆర్థిక స్తోమతను బట్టి నిర్వహించు కుంటార న్నారు. అంత్యక్రియల నిర్వహణకు నగదు ఇవ్వాలని రేటు నిర్ణయించడం సరైన నిర్ణయం కాదన్నారు. ఎక్కడన్నా స్మశానాలలో కాటి కాపర్లు అధికంగా నగదు వసూలు చేస్తే వారిపై చర్యలు తీసుకోవాలని, కాటి కాపర్ల పేరుతో ప్రజల పై భారం వేయడం అసమంజసం అన్నారు. ఈ సమస్య పై స్థానిక శాసన సభ్యులకు వినతి పత్రం అంద చేయడానికి వెళ్లిన అఖిలపక్ష నాయకులకు ఎంఎల్‌ఏ వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు తప్పితే, వినతి పత్రం తీసుకోలేదన్నారు. శాసన సభ్యుల నుండి సానుకూల స్పందన రాలేదని తెలిపారు. ఈ నెల 30 వ తేదీన ఏలూరు జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ధర్నా లో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. 30 వ తేదీన జరిగే ధర్నా కార్యక్రమానికి బిఎస్‌పి రాష్ట్ర నాయకులు నేతల రమేష్ బాబు, లోక్ సత్తా జిల్లా కన్వీనర్ చిక్కా భీమేశ్వర రావులు మద్దతు గా పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు బద్దా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మంగరాజు మృతి



విశాలాంధ్ర -నూజివీడు : ఎస్‌టియు (స్టేట్ టీచర్స్ యూనియన్) నూజివీడు తాలూకా అధ్యక్షులుగా, టీచర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులుగా పనిచేసిన వి. మంగ రాజు (86) మంగళవారం తెలంగాణా రాష్ట్రం గోదావరి ఖనిలో తన కుమార్తె ఇంట మృతి చెందారు. ఈయన మృత దేహాన్ని ఃబుధవారం నూజివీడు లోని ఆయన స్వగృహానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. వీరు నూజివీడు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్కు వ్యవస్థాపక అధ్యక్షులుగా ఉంటూ పనిచేస్తున్నారు. అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలలో భాగస్వామ్యం వహించటం తో పాటు సంగీత, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలలో ఎంతో ఉత్సాహంగా వీరు అన్ని కార్యక్రమాలలో పాల్గొనేవారు. ఈయన ఉపాధ్యాయునిగా పనిచేస్తూ తన సర్వీస్ కాలంలో ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారు. కీ.శే. దాసరి నాగభూషణరావు స్వగ్రామం దిగవల్లిలో ఉపాధ్యాయులుగా పని చేస్తూ వివిధ ప్రాంతాలలో పనిచేసి, ప్రధానోపాధ్యాయులుగా పదవీ విరమణ చేశారు. మంగరాజు మృతి వార్త తెలిసిన వెంటనే వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు వారి ఇంటికి వచ్చి శ్రద్ధాంజలి ఘటించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కృష్ణా జిల్లా అధ్యక్షులు మోతుకూరి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ కార్యదర్శి టీఎస్ బోస్, సిపిఐ నాయకులు కొమ్మన నాగేశ్వర రావు, చలసాని రామారావు, బత్తుల వెంకటేశ్వరరావు, చాట్ల పుల్లారావు, వివిధ ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు వారి స్వగ్గోహానికి వెళ్లి పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించారు. సీపీఐ నూజివీడు నియోజకవర్గ సమితి ఒక ప్రకటనలో మంగరాజు మృతికి తీవ్ర సంతాపాన్ని తెలియజేసింది. వారి మృతి నూజివీడు పట్టణంలో ముఖ్యంగా సీనియర్ సిటిజన్స్‌కు తీరని నష్టమని పేర్కొన్నారు.

డాక్టర్ పరాత్పరరావు ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర - ఏలూరు : ప్రముఖ వైద్యులు, శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ వేగుంట పరాత్పర రావు ఆశయా లను, ఆదర్శాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ఏలూరు నగరంలో శాంతిని నెలకొల్పాలని వక్తలు కోరారు. ఏలూరు కొత్తపేటలో గౌరీ దేవి మందిరం వద్ద పరాత్పర రావు 4వ వర్ధంతి శాంతి సంఘీభావ సంఘం ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి కడుపు కన్నయ్య అధ్యక్షత వహించారు. పరాత్పర రావు చిత్రపటానికి డాక్టర్ వై ఆర్ కె ప్రసాదరావు పూలమాలవేసి నివాళులర్పించారు. పరత్పరరావు ఏలూరు నగరంలో జిల్లాలో రాష్ట్రంలో శాంతి సంఘీభావ సంఘాన్ని నిర్మాణం చేయడంలో ప్రముఖ పాత్ర వహించా రని సీనియర్ న్యాయవాది వాకడ రాజారావు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు తెలిపారు. నగరంలో పేద ప్రజలకు ఉచిత వైద్యాన్ని అందించారని, నిరుపేదలైన విద్యార్థులకు పుస్తకాలు,ఫీజులు చెల్లించి చదువుకు

సహాయపడే వారని కొనియాడారు. వర్ధంతి సభలో డాక్టర్ ప్రసాదరావు, సిఆర్ రెడ్డి రిటైర్డ్ లైబ్రరీ యన్ ఎల్ వి అర్, సిరికి మల్లేశ్వరరావు, ఎస్. సంజీవరావు, జి. శివ, పుప్పాల కన్నబాబు తదితరులు మాట్లాడారు. ప్రజానాట్య మండలి గాయకులు తమ్మ విశ్వేశ్వరరావు పాడిన పాటలు సభికులను ఆకర్షించాయి. సభలో చింతల సూర్యనారాయణ, రౌతు వెంకటేశ్వరరావు, దిలీప్ మాస్టారు, గేదెల నాగేశ్వరరావు, పాల బలరాం, చింతల దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రనాథ్ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - తణుకు : ఆంధ్ర ప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త వంక రవీంద్రనాథ్ జన్మదిన వేడుకలు నిరాడం బరంగా ప్రముఖుల, కార్మికులు అభిమానులు సమక్షంలో ఆహ్లాద కరంగా జరిగాయి. పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, తిరుమల దేవస్థానం శాలువాతో సత్కరించారు. వైసీపీ నాయకులు, టీసీ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమయ్య, పాలకొల్లు తాడేపల్లిగూడెం ఛాంబర్ అఫ్ కామర్స్ అధ్యక్షులు వివిధ సేవ రంగ నాయకులు రవీంద్ర నాథ్ ను మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని అభినందించారు.

నాటి తరం నేతలు నేటి తరానికి ఆదర్శం

విశాలాంధ్ర-నూజివీడు: ప్రజాక్షేమం కోసం అహర్నిశలు శ్రమించిన నాయకు లను ఆదర్శంగా తీసుకుని నేటి యువత ప్రజాక్షేత్రంలో పని చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం మండ లంలో వెంకటాద్రిపురం గ్రామంలో దివంగత తెలుగుదేశం పార్టీ నాయకులు చలసాని గోపాలకృష్ణమూర్తి 17 వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకటరామారావు, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు కాపా శ్రీనివాసరావు, తెలుగుదేశం మండల అధ్యక్షుడు ముసునూరు రాజాబాబు తదితరులు పాల్గొని గోపాలకృష్ణమూర్తి విగ్రహాన్ని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ ప్రజల కోసం,పార్టీ కోసం గోపాలకృష్ణమూర్తి చేసిన సేవలను గుర్తు చేశారు.గోపాలకృష్ణమూర్తి పట్టుదలతో పనులు సాధించేవారని ఆ పట్టుదల నేటి యువతరంలో వుండాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అన్నవరం యంపిటిసి దువ్వూరి వెంకయ్య,గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆలూరి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల త్రవ్వకాలకు అనుమతులు ఎలా ఇచ్చారు?

- ఏఎంసీ మాజీ చైర్మన్ సాగిరాజు సాంబశివరాజు

విశాలాంధ్ర - ఉండి : చట్టం ఎవరికి చుట్టం కాదని, సామాన్యుడికి ఒక న్యాయం, పెత్తందారికి ఒక న్యాయమా, తనకు అనుమతులు లేనప్పుడు తన పక్క చెరువులకు ఎలా అనుమతులు ఇచ్చారని అధికారుల తీరుపై ఏఎంసీ మాజీ చైర్మన్ సాగిరాజు సాంబశివరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సాంబశివరాజు మీడియాతో మాట్లాడుతూ తన పొలం ఆక్వా జోన్లో ఉన్నప్పటికీ పక్క రైతు వాళ్లు రాజకీయ పరంగా చెరువు తవ్వకుండా ఇబ్బందులు పెడితే దానికి మద్దతు తెలిపిన అధికారులు నాకు చెరువు తవ్వకునేందుకు అనుమతులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టి పేదలకు ఇళ్ల స్థలం ఇచ్చే స్థలానికి ఆనుకొని చెరువులు తవ్వుతున్నా అటువైపు ఒక్క అధికారి కూడా కన్నెత్తి చూడకపోవడం హాస్యాస్పదంగా ఉందని ధ్వజమెత్తారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన పక్కనే ఆక్వా సాగుకు ఏ రకంగా అనుమతులు ఇచ్చారు అంటూ ప్రశ్నించారు. జగనన్న కాలనీకి దూరంగా ఉన్న మా పొలాలకి లేని అనుమతులు జగనన్న కాలనీ చేర్చి ఉన్న స్థలానికి అనుమతులు ఇస్తారా అని మండిపడ్డారు. చెరువులు తవ్వకాలపై ఉండి రెవెన్యూ ఇన్స్పెక్టర్‌ను ప్రశ్నించగా ఇటీవల కాలంలో బదిలీ అయిన తహసిల్దార్ కృష్ణ జ్యోతి అనుమతి ఇచ్చినట్లు తెలిపారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెరువు తవ్వకాల్ని నిలిపివేయాలని లేనిపక్షంలో ఉన్నతాధికారులు దృష్టికి వెళ్లడమే కాకుండా కోర్టుని ఆశ్రయిస్తానని సాంబరాజు హెచ్చరించారు.

మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర - వేలేరుపాడు : ఈ నెల 30న మహిళా సమాఖ్య, యువజన సమాఖ్యల మండల మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి బాడిశ రాము కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. వేలేరుపాడు సీపీఐ కార్యాలయంలో కారం దారయ్య అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన ఆ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాసభలకు జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి దుర్గాభవాని, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి మునీర్, జిల్లా మహిళా సమాఖ్య కన్వీనర్ కొండేటి బేబీ తదితర రాష్ట్ర, జిల్లా నాయకులు రానున్నారని పేర్కొన్నారు. అనేక రంగాలలో ఎంతో అభివృద్ధి చెంది ఉన్నత శిఖరాలకు ఎదిగిన మహిళలపై వివక్ష ఎదుర్కొంటూనే ఉన్నారని వాపోయారు. మండల నలుమూలల నుండి మహిళలు, యువతీ యువకులు మహాసభలకు అధి కంగా పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, రామవరం సర్పంచ్ పిట్ట ప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కురిమళ్ళ వెంకటేశ్వర్లు, సోడే రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఉసురు పోసుకుంటున్న ప్రభుత్వం

విశాలాంధ్ర -చాట్రాయి : ఎండనకా ...వాననక రేయనకా....పగలనకా కాయ కష్టం చేసి పంటలు పండిం చిన రైతుల ఉసురు ప్రభుత్వం పోసుకుంటుందని ఏఎంసి మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం చాట్రాయి మండల టిడిపి ఆధ్వ ర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతుల సమస్యలపై నిరసనగా ధాన్యాన్ని రోడ్డుపై పోసి టిడిపి వినూత్న నిరసన చేపట్టింది. ఈ కార్యక్రమానికి రైతులకు మద్దతు తెలిపిన కాపా శ్రీనివాసరావు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు.ఏ పార్టీ అధికారంలో ఉన్న ప్రభుత్వం పని చేసేటప్పుడు కొన్ని సమస్యలు వస్తాయని ముందు జాగ్రత్తగా ఆ సమస్యలను అధిగమించటమే ప్రభుత్వం పనితీరుకు అద్దం పడుతుందన్నారు. ధాన్యం కాటాలు వేసిన తర్వాత 15 , 20 రోజులు గడుస్తున్నా లారీలు రాకపోవడంతో రాత్రింబవళ్లు రోడ్ల వెంట రైతులు పడిగాపులు పడుతున్నారన్నారు. జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవ రెడ్డి మాట్లాడుతూ జగన్ పాలన రోమ్ నగరం తగుల పడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించుకుంటూ కూర్చునట్లు వుందన్నారు. తెలుగు రైతు జిల్లా మహిళా కార్యదర్శి మాదాసు చంద్రకళ మాట్లాడుతూ ఇంటి అందం గోడలు చెప్పినట్లు జగన్మోహన్ రెడ్డి పరిపాలన తీరుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు అద్దం పడుతున్నాయన్నారు. మాజీ ఎంపీపీ కందుల కృష్ణ, టిడిపి మండల అధ్యక్షులు మరిడి చిట్టిబాబు మాట్లాడుతూ ధాన్యం ఎగుమతులకు లారీలు వెంటనే పంపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పుచ్చకాయల నోబుల్ రెడ్డి, చాట్రాయి మండల తెలుగు రైతు అధ్యక్షులు చల్లగుళ్ళ రాజారత్నం, మర్లపాలెం ఉప సర్పంచ్ వెల్ది రాజా, సీనియర్ నాయకులు వెల్ది నాగేశ్వరరావు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని నినాదాలు చేసారు.

పాలకొల్లులో దోమల విజృంభణ

విశాలాంధ్ర - పాలకొల్లు: పట్టణంలో దోమల బెడద విపరీతంగా పెరిగింది. పాలకొల్లు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఫాగింగ్ మిషన్ల ద్వారా దోమల మందును పొగ రూపంలో స్ప్రే చేస్తున్నారు. రోజురోజుకు ఇంతింతై వటుడింతై అన్న చందంగా పెరిగి, పట్టణ ప్రజలపై విజృంభిస్తున్న ఈ మెగా దోమల గుంపులను ఇవి నాశనం చేయలేవని ప్రజలు అంటున్నారు. ప్రజల రక్తం పీలుస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్న దోమలను, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా, పూర్తిగా లేకుండా చేయాలని, డ్రైనేజీల నిర్వహణ, సక్రమంగా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

అన్ని రకాల సేవలు సచివాలయంలోనే అందించాలి

విశాలాంధ్ర - ఉండి : ప్రజలు మీ సేవ కేంద్రాలకు వెళ్లకుండా పూర్తి స్థాయిలో సర్వీసులు అన్ని సచివా లయాలలోనే సంతృప్తికరమైన సేవలు అందించాలని జిల్లా కలెక్టరు జెవి మురళి అన్నారు.బుధవారం ఉండి మండలం యన్ ఆర్ పి అగ్రహారం, చెరుకువాడ, అర్తమూరు, పాములపర్రు గ్రామ సచివాలయాలను జిల్లా జాయింటు కలెక్టరు ఆకస్మికంగా తనిఖీలు చేశారు.సిబ్బంది హాజరు పట్టిక, సంక్షేమ పథకాల క్యాలెండరు ,గడువులోగా ప్రజా సమస్యల పరిష్కార నివేదిక తదితర వాటిని జిల్లా జాయింటు కలెక్టరు పరిశీలించారు. ఈ నెలలో ప్రభుత్వం అమలు చేసే పథకాలకు సంబంధించి లబ్ధిదారుల జాబితాను సోషల్ ఆడిట్ చేశారా లేదా అన్నది పరిశీలించారు. ఆయా నెలల్లో ప్రభుత్వం అమలు చేసే సంబంధిత పథకాల అర్హుల జాబితాను ప్రతినెల సచివాలయంలో ప్రదర్శించాల న్నారు. ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలను ఇంటి వద్దనే అందించేందుకు సచివాలయ వ్యవస్థ ఎంతో కీలకమన్నారు. జిల్లా జాయింటు కలెక్టరు వెంట తహశీల్దారు యం.రవీంద్ర కుమార్, యంపిడివో ఏవి అప్పారావు, వ్యవసాయ శాఖ అధికారిణి బి. సంధ్య ,సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కోడిపందాల నియంత్రణకు పటిష్ట చర్యలు

విశాలాంధ్ర - ఏలూరు : కోడిపందేలను అడ్డుకునేందుకు పటిష్ట చర్యలు చేపట్టామని ఏలూరు తహసీల్దార్ బి.సోమశేఖర రావు చెప్పారు. కోడిపందాల నివారణకు తహసీ ల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి.సోమశేఖర రావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ బి.సోమశేఖర రావు మాట్లాడుతూ కోడిపందేలను నివారించు విషయములో విలేజ్ మానిటరింగ్ కమిటీ లు సమర్థవంతంగా పనిచేయలన్నారు.ఆయా కమిటీల పర్యవేక్షణలో ఆయా ప్రాంతాల్లో పరిస్థితులు తెలుసుకునే అవకాశం ఉందన్నారు. కోడిపందాలు, జూదం, నిరోధం కోసం ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.ఈ సమా వేశంలో ఎంపీడీఓ ప్రవీణ్,ఏలూరు నగర 1, 2, 3 పట్టణ, రూరల్ ఎస్ ఐ లు,ఆర్ ఐ, గ్రామ రెవిన్యూ అధికారులు, టీమ్ సభ్యులుగా నియమించబడిన సామాజిక సేవకులు బెనర్జీ, పోలీస్, కార్యాలయం సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

కాపా జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-నూజివీడు : నూజివీడు మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్, తెలుగుదేశం నాయకులు కాపా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు బుధవారం మండలంలో ఘనంగా నిర్వహించారు.వెంకటాద్రిపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాపా శ్రీనివాసరావు కేక్ కట్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు,మండల తెలుగుదేశం అధ్యక్షుడు ముసునూరు రాజా,నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు జగ్గవరపు వెంకటరెడ్డి, తెలుగుయువత అధ్యక్షుడు చలసాని గోపాల కృష్ణ, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకటరామారావు, తెలుగుదేశం నాయకులు అక్కినేని చందు తదితరులు పాల్గొన్నారు. కాపా జన్మదినాన్ని పురస్కరించుకుని గొల్లపల్లి రఘునాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గృహ నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

విశాలాంధ్ర - ఏలూరు : గృహనిర్బంధాలు, అక్రమ అరెస్టులతో ఉద్యమాలను నియంత్రించ లేరని టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ విమర్శించారు. బుధవారం టిడిపి ఎస్ సి సెల్ ఆధ్వర్యంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నాకి వెళుతుండగా తనను అక్రమంగా అరెస్టు చేసి గృహనిర్బంధం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో దళితులకు గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 27 సంక్షేమ పథకాలను వైసిపి ప్రభుత్వం రద్దు చేసినందుకు నిరసనగా ధర్నా చేపట్టామని తెలిపారు. ప్రజాస్వామ్యయుతంగా తాము నిరసన తెలపటానికి ప్రయత్నిస్తుంటే ముఖ్యమంత్రి జగన్ అభద్రతా భావానికి లోనై దళితులను అణగదొక్కటానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి ఇకనైనా తన నిరంకుశ పోకడలను విడనాడి దళితుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

విద్యార్థులకు డిజిటల్ విద్య అందిస్తాం

విశాలాంధ్ర - భీమడోలు : విద్యార్థులకు ప్రభుత్వం డిజిటల్ విద్య అందిస్తుందని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల వాసు బాబు అన్నారు. గుండుగోలను, భీమడోలు,పూళ్ల జెడ్పీ హైస్కూల్ లో పాఠశాలలలో చదువుతున్న 8 వ తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే వాసు బాబు డిజిటల్ ట్యాబ్ లను పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించాలనే ధ్యేయంతో విద్యార్థినీ విద్యార్థులకు డిజిటల్ ట్యాబులను పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. విద్యార్థిని విద్యార్థులందరూ నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత స్థాయి పదవులను పొందాలని అన్నారు.పేద విద్యార్థులు సైతం డిజిటల్ విద్యను అందుబాటు లోకి తెస్తూ, తరగతి గదులలోనే చెప్పే పాఠాలను ఇంటికి వెళ్ళాక కూడా పిల్లలు మరింత క్షుణ్ణంగా నేర్చుకునేందుకు వీలుగా బైజూస్ పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో రామకుర్తి నాగేశ్వరరావు, తుమ్మగుంట రంగా సూరిబాబు, ఇంజేటి నీలిమ, అంబటి నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కైకాల, చలపతిరావు మృతి కళారంగానికి తీరని లోటు

విశాలాంధ్ర-భీమవరం: సినీ నటులు కైకాల సత్యనారాయణ, చలపతిరావు ఎంతో శ్రమ కోర్చి పైకొచ్చిన నటులని వారి మరణం కళా రంగానికి తీరని లోటని ఫోకస్ సంస్థ అధ్యక్షుడు గొన్నా బత్తుల మల్లేశ్వరరావు, కళా రంజని అధ్యక్షులు జవ్వాది దాశరధి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం. సీతారాం ప్రసాద్ నివాళులర్పించారు. బుధవారం ఫోకస్ సంస్థ అధ్వర్యంలో ప్రముఖ నటుడు నిర్మాత కైకాల సత్యనారాయణ, విలక్షణ నటుడు చలపతిరావు మృతికి సంతాపం ప్రకటించి భీమవరం మాజీ మున్సిపల్ చైర్మన్ గ్రంధి వెంకటేశ్వరరావు ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కైకాల సత్యనారా యణ సినీ రంగంలోనే కాకుండా రాజకీయ రంగంలో కూడా ప్రవేశించి పార్లమెంటు సభ్యులుగా గెలుపొంది ప్రజలకు సేవలు అందించారన్నారు. పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ గ్రంధి వెంకటేశ్వరరావు కూడా కళాకారుడని ఆయన చిన్న వయసులో కళా మిత్రమండలి స్థాపించి అనేక నాటకాల్లో వేషాలు వేశారన్నారు. గ్రంధి వెంకటేశ్వర స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు ఇచ్చిన దుప్పట్లను పంచిపెట్టారు. కార్యక్రమంలో కె.వెంకటరత్నం, రామకృష్ణ, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - లింగపాలెం : ధర్మాజీగూడెంలో విద్యుదాఘాతానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బబుల్(28) అనే వ్యక్తి మృతి చెందాడు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం పట్వాడ జిల్లా అజామ్‌ఘర్ మండలం సద్వవలు గ్రామానికి చెందిన మృతుడు మొక్కజొన్న ఫ్యాక్టరీలో వెల్డింగ్ పనులు చేస్తున్నాడు. పనులు ముగించుకుని తాను ఉండే గదికి చేరుకున్న బబుల్ మంగళవారం రాత్రి స్నానం చేసి వచ్చి తీగపై బట్టలు తీసుకుంటుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. హుటాహుటిన చింతలపూడి ఆసుపత్రికి తరలించి వైద్యం చేస్తుండగా మృతి చెందాడు. దీనిపై పోలీసులకు సమాచారం అందటంతో ధర్మాజీగూడెం ఎస్ఐ చెన్నారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. సంఘటన తెలుసుకున్న మృతుని బంధువులు తరలివచ్చారు. పనుల కోసం వచ్చి కానరాని లోకాలకు వెళ్ళిన భర్తను చూసి భార్య, బంధువులు విలపించారు.

రాష్ట్రంలో అరాచక పాలన

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతున్నదని టిడిపి పోలవరం నియోజకవర్గ ఇన్చార్జి బొరగం శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కన్నాపురం గ్రామంలో జరిగిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో బొరగం శ్రీనివాస్ పాల్గొన్నారు.గ్రామంలోని ప్రజల వద్దకు, దుకాణాల వద్దకు వెళ్లి వైసిపి పాలనలో, జగన్ రెడ్డి నిరంకుశ విధానాలతో 15 అంశాలను ప్రాతిపదికగా తీసుకుని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని నమోదు చేశారు. ప్రజల తరుపున టిడిపి చేస్తున్న పోరాటానికి మద్దతుగా 091- 92612 92612 నంబరుకు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షులు కేకే బాబు, గ్రామ పార్టీ అధ్యక్షులు బొమ్మ రామ గంటలయ్య, టిడిపి మండల ఉపాధ్యక్షులు నిమ్మగడ్డ రవీంద్రనాథ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు, ఏలూరు జిల్లా పార్టీ అధికార ప్రతినిధి జారం చాందినీ విద్యాసాగరిక తదితరులు పాల్గొన్నారు.

దేవుడిపట్ల విశ్వాసంతో ఉండాలి

విశాలాంధ్ర - గణపవరం : దేవుని యందు నమ్మకంతో, విశ్వాసంతో నిజమైన క్రైస్తవులుగా ఉండి దేవుని దీవెనలు పొందాలని నేషనల్ బైబిల్ ఏపీస్కోపల్ దయాసిస్ క్రిస్టియన్ థియలాజీ కాలేజీ నిర్వాహకులు బ్రదర్ రొక్కాల నాగ బుజ్జి తెలిపారు. బుధవారం గణపవరంలోని వైయస్సార్ ఇందిరమ్మ కాలనీ వద్ద విశ్వాసుల ప్రార్థన సహవాసము కల్వరి దర్శనం చర్చి వద్ద స్థానిక సంఘ కాపరి పి. ధర్మారావు (పాల్ డేవిడ్ రాజు) ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుక దేవుని మహా కృప బట్టి ఘనంగా జరిగింది. క్రిస్మస్ వేడుకకు ముఖ్య ప్రసంగలుగా దేవుని సువార్తికులు బ్రదర్ . రొక్కాల నాగ బుజ్జి పాల్గొని దేవుని వాక్యాన్ని, క్రిస్మస్ సందేశాన్ని ప్రకటిస్తూ క్రైస్తవులందరూ దేవునియందు నమ్మకంతో విశ్వాసంతో దేవుడిని ప్రేమించి ఆయనను ఆత్మతోను సత్యముతోను ఆరాధించి దేవుని దీవెనలు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమం వి . రవికుమార్ అధ్యక్షతన జరిగింది. దేవుని సువార్తికులు ఈదా ఏసు రత్నం, ధర్మ రావు, సేవకురాలు రొక్కాల ఆశీర్వాదం, కాటం రాజు, విజయ్ కుమారి, తోట మోహన్ రావు, లూథియా, కాలేబు, విజయ, ఉమా, లక్ష్మి, దేవమణి అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర- ఏలూరు : కాంగ్రెస్ పార్టీ 138వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నగర అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్ రావు పార్టీ జెండాను ఆవిష్కరించి,కేక్ ను కట్ చేసి వేడుకల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్య తెచ్చి ,అభివృద్ధి చేసింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. పార్టీ గురించి ప్రాణాలు అర్పించింది గాంధీ కుటుంబ మేనని కొనియాడారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు డి.చంద్రశేఖర్, లంకా రామ్మోహన్, గౌడరంగబాబు, చంద్రకాంతమ్మ,ఏ.వెంకటేశ్వరరావు, ఎం.సాయి మురళి, కొమ్మన సాంబశివరావు, వైవీ మల్లేశ్వరరావు,సేవాదళ్ సుబ్బారావు , పలువురు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర- పెదవేగి : మారుతున్న ఆధునిక సమాజంలో సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు 8వ తరగతినుండే అవగాహన కలిగి ఉండాలని దెందులూరు శాసన సభ్యులు కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. మండలంలో కొప్పాక, పినకడిమి, భోగాపురం, రామచంద్రపురం, కూచిపూడి, రామసింగవరం తదితర గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ట్యాబ్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యం పెంచుకునేందుకు ప్రభుత్వం ప్రతి విద్యార్థికి ఉచితంగా ట్యాబ్ లు అందిస్తోందన్నారు.ఆధునిక ఇంటర్నెట్ టెక్నాలజీని ఈ ట్యాబ్ ల ద్వారా విద్యార్థులు అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను ఎదగాలని విద్యార్థులకు ఉద్బోధించారు. విద్యార్థులు ఆధునిక టెక్నాలజీ విద్యలో ఆణిముత్యాలుగా మెరిసి తల్లిదండ్రులకు పాఠశాలలకు మంచిపేరు తీసుకురావాలని అన్నారు.

తల సేమియా చిన్నారులకు రక్త మార్పిడి

విశాలాంధ్ర - ఏలూరు : ప్రభుత్వ బోధనా ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ తలసేమియా భవనంలో 10 గురు తలసీమియా చిన్నారులకు రక్తమార్పిడి నిర్వహించామని జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బి.వి కృష్ణారెడ్డి తెలిపారు. తలసేమియా చిన్నారుల తో పాటు వారి తల్లిదండ్రులకు 25 మందికి మధ్యాహ్నం ఒక దాత సహకారంతో ఉచిత భోజనం ఏర్పాటు చేసినట్లు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బి.వి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా డాక్టర్ ఆర్.ఎస్.ఆర్.కె.వరప్రసాద రావు, డాక్టర్ జి. చైతన్య కిరణ్, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర- నూజివీడు టౌన్ : అఖిల భారత కాంగ్రెస్ పార్టీ 138 వ ఆవిర్భావ దినోత్సవం స్థానిక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పరిమి సాగర్ కుమార్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాగర్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో దేశానికి కాంగ్రెస్ పార్టీ సేవలు అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగ భరత్, సీనియర్ నాయకులు యార్లగడ్డ ఆంజనేయులు, చీకటి రాజు, మొగధాటి నాగయ్య, వనవా ఫ్రాన్సిస్, పరిమి అజరయ్య, పరిమి కిషోర్ కుమార్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - గణపవరం: భీమవరంలో జరిగే వచ్చేనెల జనవరి 2.3.4 తేదీలలో సిఐటియు రాష్ట్ర మహాసభలు. జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో ప్రచార జాత బుధవారం గణపవరం పోలీస్ ఐలాండ్ వద్ద ప్రచార సభ జరిగింది. సభలో సిఐటియు మండల కార్యదర్శి ఎం పెంటారావు అధ్యక్షతన జరిగిన సభకు జిల్లా నాయకులు ఎం రామాంజనేయులు ఎం కళ్యాణి మాట్లాడుతూ ఉద్యోగులు కార్మికులు కార్మికులు సమస్యలు పరిష్కారం కోసం చర్చిస్తావని ఈ మహాసభలకు జాతీయ నాయకులు రాష్ట్ర నాయకులు హాజరవుతారని.జనవరి 2వ తేదీన జరిగే బహిరంగ సభను భారీ ప్రదర్శన. ఉద్యోగులు కార్మికులు ప్రజలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సభలో ఎస్ లారెన్స్ కుమారి, పి గోవిందు, నారపల్లి రమణారావు. కె ఝాన్సీ, హసీనా, హిస్టరీ, ఆర్.రమణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో చేరికలు

విశాలాంధ్ర- తణుకు : ముద్దాపురం గ్రామం నుండి టీడీపీ పార్టీ నాయకులు బొల్లా శ్రీనివాస్, కార్యకర్తలు బుధవారం రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల శాఖ మంత్రి డాక్టర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వైసీపీలో చేరారు. మంత్రి కారుమూరి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తణుకు మండల అధ్యక్షులు పోలేపల్లి వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ జగనన్న ఇంటి స్థలాలు పట్టాలు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : అర్హులైన ప్రతి ఒక్కరికి జగనన్న ఇంటి స్థలాలు ఇస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు స్థానిక క్యాంపు కార్యాలయం లో బుధవారం జరిగిన వైయస్సార్ జగనన్న ఇల్లాపట్టాల పంపిణీ సభలో ఆయన ప్రసంగించారు. తాడేపల్లిగూడెంలో 4200 మందిని ఇల్లు లేని వారిగా గుర్తించామన్నారు .అందులో 3400 మందికి ఇప్పటికే పట్టాలు పంపిణీ చేసి గృహ నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. మిగిలిన వారికి కూడా 90 రోజులలో పట్టాలు పంపిణీ కార్యక్రమంలో పట్టాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇందులో భాగంగా నేడు 133 మందికి పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు .100 ఎకరాలలో లేఔట్ లు వేసి జగనన్న ఇంటి స్థలాలు పంపిణీ చేశామన్నారు .మరో 25 ఎకరాలు సేకరించడానికి జిల్లా కలెక్టర్ తో మాట్లాడటం జరిగిందన్నారు. వైసిపికి ముఖ్యమంత్రి జగనన్నకు మద్దతుగా ఉండాలని ఆయన కోరారు. ఇంకా ఈ సభలో వైకాపా జిల్లా అధికార ప్రతినిధి కొలుకులూరి ధర్మరాజు, మున్సిపల్ కమిషనర్ బి బాలస్వామి, తహసిల్దార్ అప్పారావు, హౌసింగ్ డిఇ ప్రసాదు లు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వైకాపా యువ నాయకులు కొట్టు విశాల్ ,మాజీ జడ్పిటిసి ముప్పిడి సంపత్ కుమార్ వైకాపా నాయకులు రాజా త్రినాథ్, మేడపాటి జనార్ధన్ రెడ్డి, మేడపాటి చెల్లారెడ్డి, మానుకొండ వెంకటేశ్వరరావు, బొలెం రామలక్ష్మి ,బోనం నిర్మల, వెలిశెట్టి నరేంద్ర కుమార్, వెలనాటి సత్తిబాబు, బొడ్డు సాయిబాబా, సర్వేయర్ రౌతు రామకృష్ణ, వార్డు ఇన్చార్జిలు పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్య పేద పిల్లల ఆస్తి

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని వాలంటీర్ల దగ్గర వారి వివరాలు ఉంటాయని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుధవారం జీలుగుమిల్లి పంచాయతీ రామన్నపాలెం కాలనీలో గడపగడప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీకు ఏ విధమైన సమస్యలున్నా వాలంటీర్లకు చెప్పి వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. స్థానిక ఎస్ సి హాస్టల్ నుండి మురుగునీరు మా కాలనీ వైపు వస్తున్నాయని ఆ నీరు దుర్వాసన వస్తుందని ఈ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం స్థానిక జడ్ పి హైస్కూల్లో 8వ తరగతి చదివి విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కే పోచమ్మ, జడ్పిటిసి మల్లం వసంతరావు, జీలుగుమిల్లి సర్పంచ్ సిరి జగదాంబ, ఉపసర్పంచ్ బొంతు రవితేజ, తాసిల్దార్ గద్దం ఎలీషా, ఎంపీడీవో కే మంగతాయారు, జీలుగుమిల్లి సొసైటీ అధ్యక్షులు బోధ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఎస్ శ్రీనివాసు, కో ఆప్షన్ మెంబర్ బి ప్రేమ్ కుమార్ , వైసిపి సీనియర్ నాయకులు చందా ప్రసాద్ ,పంచాయతీ కార్యదర్శి పి అశోక్ కుమార్, హెచ్ఎం ఎస్ రామారావు ఎంఈఓ కే శ్రీనివాసరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-టి.నరసాపురం : ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ ఎం. శ్రీనివాస్ తెలిపారు. ఏపిగుంట పంచాయతీ శ్రీరామవరం గ్రామంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 20మంది గర్భిణీ స్త్రీలకు, 40మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా వుంచాలి అన్నారు.నివాసిత ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని మంచుకు దూరంగా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్ పి జి రాజ్యలక్ష్మి, ఏఎన్ఎం జ్యోతి, ఆశావర్కర్లు 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఉపాధ్యాయుల ఆర్థిక సహకారం

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : ప్రమాదంలో గాయపడిన తామరఖండి వందన అనే విద్యార్థినికి పెదతాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు 40 వేల రూపాయలు ఆర్థిక సహకారాన్ని అందజేశారు. పాఠశాల నుంచి ఇంటికి వెళ్ళే సమయంలో ప్రమాదవశాత్తు జారిపడిపోవడంతో కాలుకి తీవ్ర గాయం అయ్యింది. దీంతో తల్లిదండ్రులు ప్రవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. తల్లిదండ్రులు శ్రీకాకుళం జిల్లా నుంచి పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లి సమీపంలోని కోళ్ళపారంలో ఉపాధి నిమిత్తం రావడంతో వారికి ఆరోగ్యశ్రీ కార్డు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ విద్యార్థి వందన కు చికిత్స అందించారు. మానవత దృక్పథంతో విద్యార్థి ఆర్థిక ఇబ్బందిని దృష్టిలో పెట్టుకుని స్పందించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ లాల్ బీబీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు 40 వేల రూపాయలు ఆర్థిక సహకారం బుధవారం విద్యార్థి తల్లిదండ్రులు నాగరాజు, లక్ష్మీలకు అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బద్దె విజయశ్రీ గండికోట శ్రీనివాస రావు, మంతెన లక్ష్మీపతిరాజు, మేకా రామారావు, ఆకెళ్ళ విజయ కుమార్, ఆలపాటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల పేరుతో పెన్షన్లకు కోత

విశాలాంధ్ర - ఏలూరు : జనవరి నుంచి పెన్షన్ మొత్తం పెంచుతున్నట్లు అర్భాటంగా ప్రకటించిన ముఖ్యమంత్రి జగన్ ఇప్పటికే ఉన్న పెన్షన్లలో నిబంధనల పేరుతో కోత విధించేందుకు కుట్ర పన్నారని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి బడేటి రాధాకృష్ణయ్య(చంటి) ఆరోపించారు. టిడిపి చేపట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ఏలూరు జిల్లా వాణిజ్య సెల్ ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన వ్యాపారస్తులకు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బడేటి చంటి ఏలూరు లోని వాణిజ్య సముదాయాలలో ప్రతి షాపునకు వెళ్లి వ్యాపారాలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 14 అంశాల్లో వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. తమ ప్రభుత్వం వస్తే వ్యాపారులకు పూర్తి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం బడేటి చంటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి అభివృద్ధిని మరచి తన వైఫల్య పాలనతో అన్ని వర్గాలపై పన్నుల భారం మోపుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమం లో వాణిజ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు పైడెటి రఘు,ఏలూరు పార్లమెంట్ అధ్యక్షులు కేకే బాబు, కార్యదర్శి రాజు, నగర వాణిజ్య సెల్ అధ్యక్షులు ఎం. జనార్ధన్, కార్యదర్శి టి. మనోహర్,ఎం ప్రసాద్, మోహన్ బోస్లీ,పి. రాంబాబు,టి. అరుణ,పి. సంధ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 43,551మంది కౌలు రైతులకు సిసి ఆర్ సి కార్డుల అందజేత

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లాలో 2022-23 సంవత్సరంలో 57,652 సి.సి.ఆర్.సి కార్డుల లక్ష్యానికి ఇంతవరకు 43,551 కార్డులు కౌలు రైతులకు అందించడం జరిగిందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.సి.సి.ఆర్.సి కార్డులపై ఆయా మండలాలలోని బ్యాంకుల నుండి ఇప్పటివరకు మొత్తం రూ 46.79 కోట్లను పంట రుణాలుగా మంజూరు చేయడమైనదన్నారు.ప్రభుత్వ అందించు వివిధ పథకాలైన పెట్టుబడి రాయితీ , రైతుభరోసా , ధాన్యం అమ్ముకోవడం వంటివి ఎటువంటి ఇబ్బంది లేకుండా సి.సి.ఆర్.సి కార్డులు పొందిన కౌలు రైతులకు అందే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు భూయజమాని వారి వారి కౌలురైతులను సమన్వయ పరుస్తూ ఇరువురూ పరస్పర అంగీకారానికి వచ్చు దిశగా గ్రామాలలో రైతుల సమావేశములు ఏర్పాటు చేయుట వంటి చర్యలు చేపడుతున్నామని తెలియజేశారు.

దొంతికుర్రులో ఇదేం కర్మ రాష్ట్రానికి

విశాలాంధ్ర - కాట్రేనికోన : మండల తెలుగుదేశం ఆధ్వర్యంలో దొంతికుర్రు గ్రామంలో గురువారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటా తిరిగి వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. కరపత్రాలను పంచి ఇదేం కర్మ అనే ప్లే కార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ వైసీపీ పాలనలో మాకు ఒరిగిందేమీ లేదని, బియ్యం తదితర నిత్యవసర ధరలను పెంచి పేదలను ఇక్కట్ల పాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - ఆలమూరు : కపిలేశ్వరపురం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో గల ఆలమూరు మండలంలో పలు గ్రామాల అంగన్వాడి కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్త, సహాయకురాల పోస్టులు భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కపిలేశ్వరపురం ఐసిడిఎస్ సిడిపిఓ ఏ గజలక్ష్మి తెలిపారు. అంగన్వాడి కార్యకర్త ఒక పోస్టుకు గాను పెదపల్ల-3 ఓసి అంగన్వాడి సహాయకురాలు పోస్టులకుగాను బడుగువానిలంక-2 బిసి డి, మూలస్థాన అగ్రహారం- 8 ఎస్సీ, చొప్పెల్ల-7 ఎస్సీ, చెముదులంక-5 ఓసి, మూలస్థాన అగ్రహారం-6 ఓసిలకు కేటాయించినట్లు సిడిపిఓ తెలిపారు. పై ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు స్థానిక వివాహితులై పదవ తరగతి ఉత్తీర్ణత చెంది ఉండాలని, 01 జూలై 22వ తేదీ నాటికి 21వ సంవత్సరం నిండి 35 సంవత్సరాలలోపు ఉండాలని, దరఖాస్తుతో పాటు విద్యార్హత, స్థానిక, కుల ధ్రువీకరణ పత్రంతో పాటు పుట్టిన తేదీ, ఆధార్ కార్డు నకళ్ళను జత చేసి పూర్తి చేసిన దరఖాస్తును కపిలేశ్వరపురం ఐసిడిఎస్ కార్యాలయం పనివేళల్లో జనవరి 7వ తేదీ లోపు అందజేయాలని ఆమె తెలిపారు. ఖాళీ దరఖాస్తులు కపిలేశ్వరం ఐసిడిఎస్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని కావలసిన అభ్యర్థులు ఉదయం 10 గంటల నుండి 5 గంటలు లోపు కార్యాలయం పనిచేసే రోజుల్లో పొందవచ్చునని, మరిన్ని వివరాలకు కార్యాలయాన్ని సంప్రదించాలని సిడిపిఓ తెలిపారు.

కొత్త మోటారు ఏర్పాటు

విశాలాంధ్ర - తాళ్ళపూడి : మండల కేంద్రమైన తాళ్లపూడి పంచాయతీ భాగమైన కుకునూరు సచివాలయ పరిధిలో మోటార్ పాడై త్రాగు నీటి సరఫరాకు ఆటంకం కలగటంతో అత్యవసర పనుల క్రింద పనులు చేపట్టినట్లు సర్పంచ్ నక్కా అనురాధ తెలిపారు. ఈ మేరకు పంచాయతి కార్యదర్శి డి.ఎస్.సి శ్రీనివాస్ మాట్లాడుతూ, త్రాగు నీటి సరఫరాకు ఆటంకం కలగకుండా 10 ఎచ్.పి కొత్త మోటారు ను సుమారు 65 వేల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ మేరకు బుధ వారం కొత్త మోటోర్న బిగించినట్లు చెప్పారు. నాయకులు నక్కా చిట్టిబాబు, అనురాధ దంపతులు అధికారులతో కలిసి పనులు పర్యవేక్షించారు.

కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



విశాలాంధ్ర-దేవరపల్లి: 138 వ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దేవరపల్లి మండలం దుద్దుకూరులో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెలగా రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర పిసిసి సభ్యులు కాకర్ల హరిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాకర్ల హరిబాబు మాట్లాడుతూ పిసిసి ప్రసిడెంట్ గిడుగు రుద్రరాజు రాష్ట్ర పర్యటనలో భాగంగా ఈనెల 30వ తేదీన రాజమండ్రి లో ఆనం రోటరీ హాల్లో ఉదయం 10గంటలకు కాంగ్రెస్ నాయకుల సమావేశం జరుగుతుందని కార్య కర్తలు, నాయకులు హాజరు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ సెక్రటరీ చాపల వెంకటేశ్వరరావు, నల్లజర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఫ్రాన్సిస్, గుత్తికొండ సూరిబాబు, పాపోలు గంగారావు, శ్రీ మన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



విశాలాంధ్ర - మామిడికుదురు : కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మామిడికుదురు సెంటర్లో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ కూడలిలో పార్టీ జెండా ఎగర వేశారు. మండల అధ్యక్షులు గెద్దం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు నాయకత్వంలో వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం దిశగా అడుగులు వేస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. జిల్లా కార్యదర్శి అప్పన శ్రీరామకృష్ణ, నీతి పూడి బాల సత్యనారాయణ, ఎం రత్నం తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకునేందుకు ప్రభుత్వం కృషి



విశాలాంధ్ర-గోపాలపురం : సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థులు అందిపుచ్చుకునే విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎంపీపీ ఉండపల్లి సత్యనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ నందు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంప్యూటర్ ట్యాబ్ లను 8వ తరగతి విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం కె నారాయణ, గోపాలపురం హెచ్ఎం సోమశేఖర్ సొసైటీ అధ్యక్షులు కోసం రామ్మోహన్ రెడ్డి ముల్లంగి శ్రీనివాసరెడ్డి ఎస్ కే ఖాదర్ వలీ, కాకుల పాటి శ్రీను, పడమటి సత్యనారాయణ, దొమ్మేటి కృష్ణంరాజు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు కొద్దిగా ఓపిక పట్టాలి

- జిల్లా వ్యవసాయ అధికారి రామకృష్ణ

విశాలాంధ్ర - చాట్రాయి : ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీల సమస్య ఉన్న మాట వాస్తవమేనని రైతులు కొద్దిగా ఓపిక పట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి వై .రామకృష్ణ తెలిపారు. బుధవారం చాట్రాయి మండల రైతు భరోసా కేంద్రానికి ఆయన వచ్చిన సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రం సమస్యను విశాలాంధ్ర విలేఖరి ఆయన దృష్టికి తీసుకువెళ్ళగా ఆయన వివరణ ఇచ్చారు. 64 లారీల రిజిస్ట్రేషన్ చేయించుకోగా ఇప్పటికే 120 లారీలతో ఎగుమతులు చేయించడం జరుగుతుందన్నారు.ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం పనిచేస్తుందన్నారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి బి.శివశంకర్ తో కలిసి మొక్కజొన్న సాగును క్షేత్ర పరిశీలన చేశారు.

సహస్ర అడుగులు స్వాహా

- -నాడు బీద అరుపులు నేడు దోపిడీలు
- -ప్రజా సంపదను కాపాడిన చరిత్ర 'టీడీపీ'దే
- -అంబానీ,ఆధాని రాజానగరం వైసీపీ సీటు కోసం ఆరాటం
- - నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి పెందుర్తి వెంకటేష్

విశాలాంధ్ర-రాజానగరం: ఎన్నికల ముందు బీద అరుపులు అరిచి ఎన్నికల తర్వాత నుండి మట్టి,ఇసుక, గ్రావెల్ వంటి సంపదల దోపిడీకి అధికార ప్రతినిధులు పాలుపడుతున్నారని రాజానగరం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి పెందుర్తి వెంకటేష్ అన్నారు. మండలంలోని కొత్త తుంగాపాడు, జి.యర్రంపాలెం గ్రామాలు సరిహద్దుల్లోని ఎర్రకొండల తవ్వకాలును తెలుగుదేశం ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, తెలుగు తమ్ముళ్లు బుధవారం పరిశీలించారు.దీనిలో భాగంగా మట్టి మాఫియా అనధికారి కంగా తవ్విన ప్రాంతాలను చూసి ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పెందుర్తి మాట్లాడుతూ తుంగపాడులోని పురాతనమైన రెండు కొండలు సుమారు 100 అడుగుల పైనే నేలమట్టం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.తమ దశాబ్దికాలం పాలనలో ప్రజా సంపద, పర్యావరణ పరిరక్షణను కాపాడమని చెప్పారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల పాలనలో కొండలు, గుట్టలు,కొల్లగొట్టడం తో పాటు అక్రమాలను, అరాచకాలకు అడ్డాగా నియోజకవర్గాన్ని తయారు చేసారని మండిపడ్డారు.ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దగ్గరకు అంబానీ,ఆధాని వంటి వ్యాపార దిగ్గజాలు వైసీపీ నుండి రాజానగరం అసెంబ్లీ సీటు ఇమ్మని అసిస్తున్నారని ఆరోపించారు.తమ వ్యాపారాలు సైతం ఆపేస్తామని తమకు ఆ సీటు కావాలని అడిగేరంటే ఏ స్థాయిలో అక్రమ ఆదాయ వనరులు ఉన్నాయో అర్థమవుతుందని ఎద్దేవా చేశారు.తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అనుమతి లేని ఒక్క ఇసుక లారీని చుబించ లేదని,అయితే సమయం దాటిందని, ప్రమాదం జరిగినప్పు డు మాత్రమే లారీలను ఆపేవారన్నారు. ప్రస్తుతం వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తుంగాపాడు, కాపవరం, కునవారం,కోటి కేశవరం, మునగాల తదితర ప్రాంతాల్లో తవ్విన మట్టి మాఫియాను ఆధారాలతో చుబిస్తున్నామన్నారు. టీడీపీ హయాంలో నీరు చెట్టు పథకం ద్వారా చెరువులు శుభ్రం చేశామని, వైసీపీ హాయంలో ఏ పథకం ద్వారా చేస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు.అర్ధరాత్రి ఆడవారే కాదు సాయిత్రం ఆరు దాటితే మగవాళ్లు సైతం బయట తిరగలేని పరిస్థితుల్లో ప్రస్తుతం ఉన్నామని దుయ్యబట్టారు.టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మట్టి తవ్వకాలకు పాల్పడిన ప్రతిఒక్కరితో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజా సంపద ప్రజలకే అందాలని,ఎవరి పాలనలో ఎలా ఉన్నదో ప్రజలే గ్రహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు గంగిశెట్టి చంటిబాబు, పార్లమెంటు కన్వీనర్ కొల్లంరత్నం, నాయకులు తోటకూర నాగేశ్వరరావు, నిలపాల అరవరాజు,మద్దిపాటి చిన్న వెంకటేశ్వరరావు, దాసరి శ్రీనివాస్,చిట్టిప్రోళ్ల పద్దరాజు, మింగి లక్ష్మీనారాయణ,దూది కాంతారావు, దేశాల ,ఉప్పలపాటి వి.వి.సత్యనారా యణ రాజు వర్మ,సంగీత సత్యనారాయణ, ఖండవిల్లి లక్ష్మీ,సంగుల శ్రీనుమునసా అప్పారావు, టీడీపీ నాయకులు భారీగా పాల్గొన్నారు.

టీడీపీ నా ఊపిరి...గెలుపే నా లక్ష్యం

విశాలాంధ్ర - చాట్రాయి : టీడీపీ నా ఊపిరి అని పార్టీ గెలుపే నా లక్ష్యంగా నిరంతరం పయనిస్తున్నానని నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు తెలిపారు. చాట్రాయి మండల టీడీపీ కార్యాలయంలో మండల పార్టీ ఆధ్వర్యంలో కాపా శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ శ్రేణులను ఉద్దేశించి కాపా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి పార్టీయే తన శ్వాసగా,4 దశాబ్దాలుగా పనిచేస్తున్నానని గుర్తు చేశారు. పార్టీలో పదవుల కన్నా ప్రజాసేవే మిన్నగా పనిచేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు మరిడి చిట్టిబాబు, తెలుగు రైతు జిల్లా మహిళా కమిటీ కార్యదర్శి మాదాసు చంద్రకళ, మాజీ ఎంపిపి కందుల కృష్ణ, వెల్ది రాజా, వెల్ది అప్పారావు, నోబుల్ రెడ్డి, కంచర్ల హనుమంతరావు, బొర్రా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మా అబ్బాయి చనిపోయి మూడేళ్లు అవుతున్నప్పటికీ బీమా రాలేదు

- ఓ బాధితురాలి ఆవేదన

విశాలాంధ్ర - చాట్రాయి : అయ్యా.... ప్రమాదంలో.... మా అబ్బాయి మరణించి మూడేళ్లు గడిచిపోయింది. నేటికి బీమా రాలేదు ఇప్పించండయ్యా.... అంటూ ఓ బాధితురాలు మొరపెట్టుకున్న వైనమిది. బుధవారం చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న ఎంపీడీవో మురళీమోహన్ వద్దకు చనుబండ పంచాయతీ సూరం పాలెం గ్రామానికి చెందిన కుక్కరపాటి లక్ష్మీ అనే బాధిత మహిళ తన దీనగాథను వివరించింది. మూడేళ్ళ క్రితం ప్రమాదంలో చేతికొచ్చిన తన కొడుకు చనిపోయాడని, రెక్కాడితే గాని డొక్కనిండని నిరుపేద కుటుంబమని తెలిపింది. దుర్భరమైన జీవితం గడుపుతున్నామని, నా కొడుకుకి రావలసిన బీమా ఇప్పించండి అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. స్పందించిన ఎంపీడీవో మురళీమోహన్ సంబంధిత శాఖల వారికి ఫోన్ చేసి సమాచారం తెలుసుకున్నారు. ఏ పథకం రావాలన్నా ప్రభుత్వం నిబంధన మేరకే ఆధారపడి ఉంటుందని మరోసారి పై అధికారులకు తెలియజేయాలని వివరించారు.

డాక్టర్ బిఆర్ కృష్ణ ప్రసాద్ రాధమ్మ దంపతులకు సన్మానం



విశాలాంధ్ర - అమలాపురం : ఐఎస్ఓ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ శ్రీ శ్రీ కళావేదిక, కోనసీమ రచయితల సంఘం నూతన కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన అమలాపురం పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ బిఆర్ కృష్ణ ప్రసాద్, రాధమ్మ దంపతులను బుధవారం స్థానిక సూర్య నగర్‌లో గల వారి స్వగృహంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా శ్రీ శ్రీ కళావేదిక అధ్యక్షులు, ప్రముఖ సాహితీవేత్త నల్లా నరసింహమూర్తి, కోనసీమ రచయితలు సంఘం అధ్యక్షులు, ప్రముఖ కవి బివివి సత్యనారాయణ ఘనంగా సన్మానించారు. వైద్య, ఆధ్యాత్మిక, సేవారంగంలో నిరంతరం సేవలందిస్తున్న డాక్టర్ కృష్ణ ప్రసాద్ రాధమ్మ దంపతులు సాహిత్య సాంస్కృతిక రంగంలో కూడా సేవలు అందించాలని కవులు నల్లా, బివివి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాకారులు కవులను తప్పక ఆదరిస్తామని తెలిపారు. శ్రీ శ్రీ కళావేదిక జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ చేస్తున్న నిస్వార్థమైన సాహితీ సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో బుర్రకథ కళాకారుడు కడలి సత్యనారాయణ, విత్తనాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

విశాలాంధ్ర - ఆత్రేయపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న 32మంది విద్యార్థులకు గ్రామ వైస్ ప్రెసిడెంట్ బాబురావు పాటశాల ఆవరణలో ఈ రోజు విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. బొబ్బర్లంక గ్రామం పాఠశాలలోనీ విద్యార్థులకు సర్పంచ్ చేతుల మీదుగ్గా విద్యార్థులకు టాబ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నరాల శెట్టి సుబ్బలక్ష్మి, బొబ్బలంక గ్రామ సర్పంచ్, వాడపల్లి గ్రామ వైస్ ప్రెసిడెంట్ బాబురావు, ప్రధానోపాధ్యాయులు నాదెళ్ల వెంకట్రావు, లండన్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ప్రకాష్, విద్యా కమిటీ చైర్మన్ శ్రీను, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి తండ్రులు తదితరులు పాల్గొన్నారు.